ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

బుధవారం 2 అక్టోబరు 2024

నిర్లక్ష్య ఫలితం..!

పురంలో మళ్లీ పాతరోజులు

- నీటికి కటకట
- 15 రోజులకోసారి సరఫరా
- గొల్లపల్లి వద్ద పనిచేయని రెండు మోటార్లు
- ఒక్క దానితోనే పంపింగ్
- నెలలుగా సమస్య
- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- పట్టణవాసులకు నీటి కష్టాలు

జాగరణ చేస్తున్నాం



15 రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారు. అది కూడా అరకొరగానే వదులుతున్నారు. అర్ధరాత్రిలో వదిలినా మేలుకుని తెల్లారే వరకు నీరు పడుతున్నాం. కూలి పనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నాం. ఈ పరిస్థితుల్లో డబ్బు పెట్టి నీరు కొనగలమా?

\- పర్వీన్, రహమత్‌పురం



రహమత్‌పురంలో ఇంటి ముందు ఉంచుకున్న డ్రమ్ములు



హిందూపురం అర్బన్, అక్టోబరు 1: పట్టణం గతంలో నీటి కష్టాలకు పెట్టిందిపేరు. రాష్ట్రంలోనే అత్యంత నీటి సమస్య ఉన్న ప్రాంతంగా అప్పట్లో గుర్తింపుపొందింది. 2019లో ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో నీటి కష్టాలకు చెక్‌పడింది. పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణానికి నీరు సరఫరా చేసేలా పథకాన్ని రూపొందించారు. రూ.కోట్లు వెచ్చించి, పూర్తి చేశారు కూడా. అప్పట్నుంచి పట్టణవాసులకు నీటి కష్టమనేది లేకుండా పోయింది. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్య ఫలితంగా మళ్లీ పురంలో నీటి కష్టాలు తలెత్తాయి. గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పట్టణానికి సరఫరా చేసేందుకు మూడు మోటార్ల ద్వారా నీటిని తోడుతారు. వాటిలో రెండు మరమ్మతుల బారినపడ్డాయి. నెలలు గడుస్తున్నా.. పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో ఉన్న ఒక్క మోటారుతోనే నీటిని తోడుతున్నారు. అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. పట్టణానికి రోజుకు 27 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) నీరు అవసరం కాగా.. ప్రస్తుతం 6.5 మిలియన్ లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో పట్టణవాసులకు 15 రోజులకోసారి నీరు అందుతోంది. అది కూడా అరకొరగానే. ఆ నీరు చాలక ప్రైవేటు ట్యాంకర్ల వద్ద కొంటున్నట్లు పట్టణవాసులు ఆవేదన చెందుతున్నారు. ఆ నీటిని పట్టుకునేందుకు ఇళ్ల ముందు పెద్దమొత్తంలో డ్రమ్ములు, టబ్బులు, ట్యాంకులు, చిన్నచిన్న పాత్రలు ఉంచుకున్నారు. మోటార్లకు సకాలంలో మరమ్మతులు చేయించి ఉండుంటే ఈ దుస్థితి దాపురించేది కాదని వాపోతున్నారు. ఈ నీటి కష్టంపై కూటమి పాలకులు దృష్టిపెట్టారు. మోటార్ల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. రెండ్రోజుల క్రితం ఒక మోటారును మరమ్మతుల నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. మరమ్మతులకు నెలకుపైగా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకు కష్టాలు తప్పవా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.



చిన్నచిన్న పాత్రల్లోకి నీటిని నింపుతున్న గృహిణి

15 రోజులకోసారి..

పట్టణానికి గతంలో పీఏబీఆర్ నీరు సరఫరా అయ్యేది. నాసిరకం పైపులు ఏర్పాటు చేయడంతో రోజూ ఏదో ఒకచోట పైపులు పగిలిపోయి, సరఫరా ఆగిపోయేది. 2019 ముందు వరకు హిందూపురంలో నీటి యుద్ధాలు నిత్యకృత్యం. 2019లో ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో రూ.192 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. తద్వారా పురానికి రోజూ 27 ఎంఎల్‌డీలకుపైగా నీరు వచ్చేది. నీటి సమస్య పూర్తిగా తీరిపోయింది. ఇందు కోసం గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద 350 హెచ్‌పీ సామర్థ్యంగల 3 మోటార్లను ఏర్పాటు చేశారు. నిర్వహణలోపంతో గొల్లపల్లి వద్ద రెండు మోటార్లు మరమ్మతుల బారిన పడ్డాయి. దీంతో ఒక్కమోటారు మాత్రమే పని చేస్తోంది. దానిద్వారా 6.5 ఎంఎల్‌డీల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఆ నీరు పట్టణవాసులకు ఏమాత్రం చాలట్లేదు. ఉన్న ఒక్క మోటారును 18 గంటలు నిరవధికంగా రన్ చేసినా అరకొరగా నీరు వస్తోంది. పట్టణంలో 90 బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా కూడా నీరు సరఫరా చేసినా.. 15 రోజులకోసారి మాత్రమే కొళాయిల్లో నీరు వస్తోంది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఒక్క మోటారు ఆగిపోతే పరిస్థితి ఏంటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

టెండర్లను అడ్డుకోవడంతోనేనా..?

ఈ ఏడాది జూలైలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. అప్పట్లో మోటార్ల మరమ్మతులు, ప్యానల్ బోర్డుల ఏర్పాటు, పగిలిన పైపులు మార్చడం, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, మురుగు కాలువల వద్ద లీకేజీల నివారణ, లిఫ్టింగ్ యంత్రాల ఏర్పాటు తదితర పనుల టెండర్లను ఆమోదానికి ఉంచారు. అప్పట్లో వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. అవి కాస్తా ఆగిపోయాయి. దీంతో నీటి సమస్య తలెత్తింది. దీనిపై వార్డుల్లో ప్రజలు.. కౌన్సిలర్లను నిలదీశారు. పరిస్థితి చేయిదాటుతోందని గ్రహించిన కొంతమంది కౌన్సిలర్లు కూడగట్టుకొని గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు మున్సిపల్ అధికారులను తీసుకెళ్లి, విషయం తెలిపారు. ఇంతలోనే కౌన్సిలర్లు టీడీపీలోకి చేరిపోడం, ఆ తరువాత మూడు నెలలుగా కౌన్సిల్ మీట్ నిర్వహించకపోవడంతో అప్రూవల్‌కు నోచుకోక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.



సంపాదించినది నీటికే సరిపోతోంది

రోజంతా ఎలక్ట్రీషియన్ పనిచేస్తే రూ.500 వస్తుంది. ఇందులో సగం నీటిని కొనడానికి ఖర్చవుతోంది. ఇక పిల్లల చదువులు, పుస్తకాలు, కటుంబ పోషణ ఎలా? చాలా ఇబ్బందిగా ఉంది.

\- రియాజ్



త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

బాధ్యతలు తీసుకున్న రోజే గొల్లపల్లి రిజర్వాయర్‌ను సందర్శించా. అక్కడ పరిస్థితిని గమనించా. మోటారును బెంగళూరుకు పంపి, మరమ్మతులు చేయిస్తున్నాం. అతి త్వరలో పట్టణ ప్రజల నీటి సమస్య తీరుస్తాం.

\- సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్

మద్యం దుకాణాలు 87



జిల్లాలో ఏర్పాటుకు నోటిఫికేషన్

11న లాటరీ

పుట్టపర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటుకానున్న మద్యం దుకాణాల సంఖ్య తేలిపోయింది. మొత్తం 87 దుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. రెండేళ్ల కాలపరిమితితో నూతన మద్యం విధానాన్ని అమలు చేయనుంది. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలకు ఈనెల 9దాకా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందునాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 32 మండలాల్లో 59, హిందూపురం, ధర్మవరం, కదిరి మున్సిపాలిటీల పరిధిలో 22, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర నగర పంచాయతీల్లో ఆరు దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. మంగళవారం నుంచే అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. హిందూపురం, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, పుట్టపర్తి, పెనుకొండ, తనకల్లు, కదిరి, మడకశిర ఎక్సైజ్ స్టేషన్లలో సమర్పించవచ్చు. ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చలానా డీడీ తీయాల్సి ఉంటుంది. రూ.2 లక్షలు తిరిగి ఇవ్వరు. ప్రతి ఎక్సైజ్ స్టేషన్‌లో రెండు, మూడు దరఖాస్తు స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. 11న జిల్లా కలెక్టర్ నేతృత్వంలో మద్యం దుకాణాలకు లక్కీ డ్రా తీయనున్నారు. వివరాలకు 9963442016 నంబరుతోపాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ వివరించారు.

100 రోజుల్లోనే హామీల అమలు

- అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి సవిత
- పలుచోట్ల పింఛన్ల పంపిణీ



పెనుకొండలో వృద్ధుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్/రూరల్, అక్టోబరు1: ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజుల్లోపే అమలు చేసిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని 12, 13 వార్డులు, రొద్దం మండలంలోని తురకలాపట్నం గ్రామంలో మంత్రి సవిత.. అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం 40 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం కాగానే ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. పరిశ్రమలు వస్తున్నాయన్నారు. పెనుకొండలో అమృత్ స్కీం కింద రూ.87 కోట్లతో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు ఏర్పాటు చేసి, పైపు లైన్ల ద్వారా ఇంటింటికీ మంచి నీరు సరఫరా చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు అందిస్తామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రఘువీరచౌదరి, నియోజకవర్గ అధ్యక్షుడు కోనాపురం రామలింగ, మండల కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కృష్ణమూర్తి, మాధవనాయుడు, రొద్దం నరసింహులు పాల్గొన్నారు.

పురం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు

హిందూపురం అర్బన్, అక్టోబరు 1: స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్‌పై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆస్పత్రిలో వరుస వివాదాల నేపథ్యంలో ఆయనను బాధ్యతల నుంచి తప్పించారు. ఆస్పత్రిలో సివిల్ సర్జన్ లింగన్నకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. డాక్టర్ లింగన్న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇటీవల ఇన్‌చార్జిగా ఉన్న రోహిల్‌పై ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ వైద్యులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. రాష్ట్ర అధికారులకు లేఖ రాశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఉన్నతాధికారులు రోహిల్‌ను బాధ్యతల నుంచి తప్పించారు.

సమన్వయ సమావేశం?

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్, సీనియర్ వైద్యుల మధ్య కొన్ని నెలలుగా కోల్డ్ వార్ సాగుతోంది. అది ముదిరి పాకాన పడింది. రెండురోజుల క్రితం సీనియర్ వైద్యులు.. రోహిల్‌కు వ్యతిరేకంగా సంతకాలు చేసి, లేఖను ఉన్నతాధికారులకు పంపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో సయోధ్య కుదిర్చే ప్రయత్నాలు సాగాయని తెలిసింది. సీనియర్ వైద్యులు వ్యతిరేకించడంతో ఈనెల 5న కలెక్టర్ సమావేశం ఉంటుందనీ, అప్పుడు నిర్ణయించుకోవాలని వారికే వదిలేసినట్లు సమాచారం.

బాధ్యతల నుంచి రోహిల్ కుమార్‌ను తప్పిస్తూ ఉత్తర్వులు.. ఎఫ్‌ఏసీగా లింగన్న నియామకం



నెలాఖరులోగా ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 1: ఫ్రీహోల్డ్ భూముల రికార్డుల పరిశీలన నెలాఖరులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్.. తెలిపారు. అమరావతి నుంచి రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా, మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షచేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ.. పెనుకొండ డివిజన్‌లో పరిశీలన నిమిత్తం అనంతపురం జిల్లా నుంచి ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను రప్పించి, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓలు ఆనంద్, భాగ్యరేఖ, మహేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

హమ్మయ్య.. పంట పండింది..!

- వేరుశనగ పంట కోతలు ప్రారంభం
- ఆశాజనకంగా దిగుబడులు



తొలగించిన వేరుశనగ పంట

చిలమత్తూరు, అక్టోబరు 1: జిల్లా రైతు కొన్నేళ్లుగా పంటలు కోల్పోతూనే ఉన్నాడు. సర్వం నష్టపోతూనే ఉన్నాడు. అలాంటి రైతుకు ఈసారి వేరుశనగ నష్టాలు తప్పించింది. చిలమత్తూరు మండలంలో వేరుశనగ పంట ఆశాజనకంగా ఉంది. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయని రైతులు అంటున్నారు. రైతు నోటి నుంచి ఈ మాట వినక ఎన్నేళ్లయిందో..! ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగుచేసిన వేరుశనగ పంటలను రైతులు కోతలు కోసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో పంటలను తొలగించుకుంటున్నారు. మండలంలో ఈ ఖరీఫ్‌లో 2810 ఎకరాల్లో పంట సాగైంది. విత్తనం విత్తినప్పటి నుంచి అడపాదడపా వర్షాలు పడుతూనే ఉన్నాయి. దీంతో పంట ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతి చెట్టుకు 25 నుంచి 35దాకా వేరుశనగ కాయలు ఉన్నాయి. వెరసి పెట్టుబడితోపాటు రాబడి కూడా దక్కుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకి రూ.25 వేలకుపైగా..

ఎకరంలో వేరుశనగ పంట సాగుకు విత్తనాలు, దుక్కి, ఎరువులు, కూలీలకు రూ.15 వేల వరకు ఖర్చు చేశారు. ఇప్పుడు పంట దిగుబడి ఎకరం విస్తీర్ణంలో 15 నుంచి 20 బస్తాలు (45 కిలోలు) ఉండే అవకాశం ఉందంటున్నారు. 6 నుంచి 8 క్వింటాళ్లు వస్తుందన్నమాట. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా రూ.6 వేల వరకు ధర పలుకుతోంది. ఈలెక్కన ఎకరాకి రూ.40 వరకు రాబడి ఉంటుంది. ఇందులో పెట్టుబడి రూ.15వేలుపోను రూ.25 వేలుపైగా మిగులుతుందని రైతులు చెబుతున్నారు.

దిగుబడులు బాగానే ఉన్నాయి: మంజునాథ, రైతు, కోట్లోపల్లి



ఎకరం పొలంలో వేరుశనగ విత్తా. పంట బాగానే పండింది. మొక్కకి 25 వరకు కాయలు ఉన్నాయి. నూర్పిడి చేస్తే 18 నుంచి 20 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. మార్కెట్లో ధరలు స్థిరంగా ఉంటే ఎకరానికి రూ.40 వేలకుపైగా ఆదాయం వస్తుంది. ఖర్చులు పోను రూ.25 వేల వరకు మిగులు ఉంటుంది.

ఫ్రీహోల్డ్.. ఫ్రీ ప్లాన్డ్..!

విచారణలో బహిర్గతమవుతున్న వైసీపీ అక్రమాలు

- అంతా పథకం ప్రకారమే..
- పేదల భూములను చౌకగా కొట్టేసిన వైనం
- అనంతరం రిజిస్ట్రేషన్ ద్వారా లబ్ధి
- చర్యలు తీసుకుంటారా.. వదిలేస్తారా..?







పుట్టపర్తి సమీపంలో ఫ్రీహోల్డ్ భూముల రైతులతో ఆరాతీస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ (ఫైల్)

పుట్టపర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఫ్రీహోల్డ్ (అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించే) విధానం ద్వారా పేదల భూములను వైసీపీ నాయకులు కారుచౌకగా కొట్టేసినట్లు విచారణలో బహిర్గతమవుతోంది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ముందస్తు పథకంలో భాగంగానే ఫ్రీహోల్డ్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములను కాజేశారని తేలుతోంది. అధికారుల మెడపై కత్తి పెట్టి నిబంధనలు అతిక్రమించి మరీ.. రూ.కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములను సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్ భూములపై సమగ్ర విచారణకు ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు విచారణ కొనసాగుతోంది. దీనిపై ఇటీవల విజయవాడ నుంచి సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి.. జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్ భూములపై పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 5లోపు పూర్తిస్థాయి నివేదికఇస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈనేపథ్యంలో జిల్లాలో 22(ఏ) ఫ్రీహోల్డ్ చేసిన రిజిస్ట్రేషన్ భూముల్లో అక్రమాలు వెలికితీస్తారా.. వదిలేస్తారా.. అన్న చర్చకు తెర లేచింది. ఆగస్టులోనే ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ల పునఃపరిశీలన ప్రక్రియ మొదలుపెట్టారు. తుది దశకు చేరుకుంది. రెవెన్యూ శాఖలో బదిలీలు చేపట్టడంతో అది నెమ్మదించింది. పరిశీలన పూర్తి చేసి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తేగానీ జిల్లాలో ఏ మేరకు 22ఏ, ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలు సాగాయన్న విషయం తేలదు.

ఫ్రీగా కొట్టేసే ఎత్తుగడ

అసైన్డ్ భూములను వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, స్థిరాస్తి వ్యాపారులు ఫ్రీగా కొట్టేసే ఎత్తుగడ వేశారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీహోల్డ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. రాష్ట్రంలో అత్యధికంగా ఫ్రీహోల్డ్‌తోపాటు రిజిస్ట్రేషన్లు చేసిన జిల్లాల్లో శ్రీసత్యసాయి జిల్లా ఒకటి. వీటిపై రెవెన్యూ యంత్రాంగం రికార్డుల ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టింది. సెప్టెంబరు 1 నుంచి 45 రోజులపాటు ఆయా మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో అసైన్డ్, ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారాన్ని నిగ్గుతేల్చి, చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావించింది. సాధారణ బదిలీల నేపథ్యంలో రెవెన్యూ సదస్సులకు బ్రేక్ పడింది. ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలు, ఆర్ఐలు బదిలీపై వెళ్లారు. దీంతో ఫ్రీహోల్డ్ క్షేత్రస్థాయి పరిశీలన మందకొడిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 5వతేదీలోగా పూర్తిచేసేది ఎట్లా అని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి. ఇప్పటిదాకా చేపట్టిన పరిశీలనలో జిల్లాలో పలుచోట్ల వైసీపీ నేతలు సిఫార్సు చేసిన భూములను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు వెలుగుచూస్తోంది. కలెక్టర్ ప్రొసీడింగ్స్ లేకుండానే వందలాది ఎకరాల భూములు ఫ్రీహోల్డ్ చేసినట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించి వైసీపీ నేతలు ముందస్తు కొనుగోళ్లతో భూములు కొట్టేశారని అధికారుల పరిశీలనలో స్పష్టమవుతోంది.

నిగ్గు తేలుస్తారా...

వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు మేలుచేసే విధంగా ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు జీవో 596ను గత ఏడాది డిసెంబరులో హడావుడిగా తీసుకొచ్చారన్న చర్చ సాగుతోంది. ఎన్నికల కౌంటింగ్‌లోగా వేలాది ఎకరాల ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లాలోని 32 మండలాల్లో 1,92,329 ఎకరాల అసైన్డ్ భూములకు (ఫ్రీహోల్డ్) యాజమాన్య హక్కులు కల్పించగా.. ఆరు నెలల్లో జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నిషిద్ధ జాబితా 22(ఏ) తోపాటు ఫ్రీహోల్డ్ 5242.99 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసినట్లు లెక్కతేల్చారు. ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు సిఫార్సు చేసి కొందరికి భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్, అసైన్డ్ రిజిస్ట్రేషన్లు చేశారు. వీటిలో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు.. కొందరు బినామీ పేర్లతో కొట్టేశారు. ఫ్రీహోల్డ్ చేసిన, చేతులు మారిన రిజిస్ట్రేషన్లపై ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించాలి. ఇదంతా సక్రయంగా సాగిందా.. అక్రమాలకు పాల్పడారా.. అన్నది తేల్చాల్సి ఉంది. కొన్ని అసైన్డ్ భూములకు పట్టా ఒకరిది.. సాగులో మరొకరు.. పాసుపుస్తకం ఇంకొకరిది అన్నట్లుగా తేలాయి. ఈ నేపథ్యంలో అన్నీ సక్రమంగా ఉన్నాయని నివేదిక ఇవ్వాలంటూ రెవెన్యూ అధికారులపై కొందరు వైసీపీ నాయకులు, స్థిరాస్తి వ్యాపారులు ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అక్రమాల లెక్క తేలేనా అన్న చర్చ మొదలైంది. సమగ్ర నివేదిక సమర్పించాక మరోసారి ప్రభుత్వం పరిశీలన బృందాలను ఏర్పాటు చేస్తుందన్న ఆందోళన క్షేత్రస్థాయి పరిశీలన అధికారుల్లో నెలకొంది.

దేవుడు అడగలేడని..!

- మాన్యం కాజేసేందుకు వైసీపీ నాయకుడి యత్నం
- కౌలు చెల్లించకుండా ఏళ్ల తరబడి సాగు
- కుంటుపడుతున్న ఆలయ అభివృద్ధి
- చందాలతోనే ఆలయ పునర్నిర్మాణం
- పట్టించుకోని దేవదాయ అధికారులు

పుట్లూరు, అక్టోబరు 1: దేవుడు వచ్చి అడుగుతాడా అని అనుకున్నాడో ఏమో ఓ వైసీపీ నాయకుడు ఆలయ భూమిని కాజేయడానికి పూనుకున్నాడు. కౌలు చెల్లించకుండా ఏళ్లుగా మాన్యం భూమిని సాగు చేసుకుంటున్నాడు. అరటి వంటి పంట సాగు చేసుకుంటూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నాడు. ఈక్రమంలోనే భూమిని శాశ్వతంగా సొంతం చేసుకోవాలనే కుటిల యత్నాలకు తెరతీశాడు. పుట్లూరు మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో ఆత్మరామస్వామి ఆలయానికి అరకటి వేముల రెవెన్యూలో సర్వే నెంబర్ 94ఏలో 2.8 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 15 ఏళ్ల కిందట ఓ వ్యక్తి కౌలుకు తీసుకున్నాడు. ఏడాదికి రూ.50 వేలు చెల్లించాల్సి ఉండగా రూ.20 వేలు మాత్రమే చెల్లించాడు. అప్పటి నుంచి ఇంతవరకు ఆలయానికి పైసా ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. కౌలుకు తీసుకున్న భూమిలో అరటి, చామంతి, లిల్లీపూల పంటల సాగు చేసుకుంటూ ఏడాదికి సుమారు రూ.10లక్షల పైగానే ఆదాయం పొందుతున్నాడు. అయినా కౌలు మాత్రం చెల్లించడం లేదు. ఈ భూమి విషయంగా చర్చించడానికి ఎవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.



ఆత్మారామస్వామి ఆలయం

ఎకరా రూ.50 లక్షల పైమాటే

ఎ.కొండాపురం గ్రామంలో జాతీయ రహదారి వెళుతుండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రూ.10లక్షలు విలువజేసే భూములు ప్రస్తుతం రూ.50లక్షల నుంచి రూ.60లక్షల ధర పలుకుతున్నాయి. ఆలయ భూమి జాతీయ రహదారికి 100మీటర్ల దూరంలో తాడిపత్రి- తిమ్మంపల్లి రోడ్డు పక్కన ఉంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం ఈ భూమిపై కన్నేశారు. గ్రామంలో కౌలుకు ఇచ్చినా ఎకరానికి రూ.లక్ష మేర ఇస్తారని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం సాగులో ఉన్న కౌలు దారు కౌలు చెల్లించక ఏళ్లు గడుస్తున్నా ఏ అధికారి కూడా పట్టించుకున్న పాపానపోలేదు.

కరువైన ధూప దీపనైవేద్యాలు

రూ. కోట్ల విలువైన భూమి ఉన్నా ఆత్మారామస్వామి ఆలయానికి ధూపదీప నైవేద్యాలు కరువయ్యాయి. ఆ భూమి కౌలుకు తీసుకున్న వ్యక్తి సక్రమంగా డబ్బు చెల్లించకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. దీంతో గ్రామస్థులే సుమారు రూ.ఐదు లక్షలు చందాలు వేసుకుని ఆలయ పునర్నిర్మాణం చేశారు. ప్రతి ఏటా శ్రీరామనవమిని సైతం గ్రామస్థుల చందాలతోనే నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాగా మరోసారి ఆలయ భూమి కౌలు వేలం వేయాలన్న ఆలోచన కూడా దేవదాయశాఖ అధికారులకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



దేవాలయానికి చెందిన భూమి, ఇన్‌సెట్‌లో భూమిలో ఉన్న బోరు

కాజేసే కుట్ర

గత వైసీపీ ప్రభుత్వంలో ఆత్మారామస్వామి భూమిని కాజేసేందుకు ఆ పార్టీ నాయకుడు, ప్రస్తుత సాగుదారు కుట్ర చేసినట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో చూపని సర్వే నెంబరును తన పేరిట ఎక్కించుకోవాలని అప్పట్లో రెవెన్యూ అధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఈ విషయం గ్రామస్థులకు తెలిసి అప్పటి తహసీల్దార్‌కు చెప్పడంతో ఆన్‌లైన్ విషయం విరమించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ భూమిలో బోరువేసి పంట సాగు చేస్తున్నాడు. దీనిపై దేవదాయశాఖ ఈఓ శోభారాణిని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదు. కౌలు డబ్బులు చెల్లించకుండా సాగు చేస్తుంటే విచారించి చర్యలు తీసుకుంటాం.

అమిలినేనికి అంతర్జాతీయ పురస్కారం

మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డు ప్రకటించిన ఎన్ఆర్ఐ వెల్ఫేర్ సొసైటీ

కళ్యాణదుర్గం, అక్టోబరు 1: కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మహాత్మాగాంధీ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఎన్ఆర్ఐ వెల్ఫేర్ సొసైటీ ఆయనకు ఈ అవార్డును ప్రకటించింది. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మ్యూజియంలో ఎన్ఆర్ఐ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 125 మంది ఎన్ఆర్ఐ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఇదే సందర్భంలో అమిలినేనికి అవార్డును అందజేస్తారు. ఎంచుకున్న రంగాలలో ఉన్నత శిఖరాలకు ఎదగడంతో పాటు సమాజానికి విశిష్ట సేవలు అందించేవారికి ఏటా గాంధీ జయంతి రోజున ఈ అవార్డును అందజేస్తారు. అవార్డును అందుకునేందుకు ఎమ్మెల్యే లండన్ వెళ్లారు.



లండన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

దసరాకు అదనపు బస్సు సర్వీసులు



అనంతపురం కల్చరల్, అక్టోబరు 1: దసరా పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆధ్వర్యంలో వివిధ రూట్లకు అదనపు బస్సు సర్వీసులు నడపనున్నట్లు రీజనల్ మేనేజర్ సుమంత్ మంగళ వారం వెల్లడించారు. అనంతపురం నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు, చెన్నై రూట్లకు సర్వీసులు నడుపుతా మన్నారు. పండుగకు ఊళ్లకు వెళ్లేవారి కోసం ఈనెల 4 నుంచి 11 వరకు 110 అదనపు సర్వీసులు, పండుగ తర్వాత తిరుగు ప్రయణానికి 13 నుంచి 16వ తేదీ వరకు 100 సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. కాగా అదనపు సర్వీసుల్లో కూడా సాధారణ టికెట్ చార్జీలే ఉంటాయన్నారు. రాను, పోను టికెట్లను ముందుగా బుక్ చేసుకున్నవారికి టికెట్ ధరలో 10 శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు.

రూట్	4 - 11 వరకు సర్వీసులు	13-16 వరకు సర్వీసులు
బెంగళూరు	48	41
విజయవాడ	6	7
తిరుపతి	3	4
ఒంగోలు/నెల్లూరు	4	7
హైదరాబాద్	45	35
చెన్నై	4	6
మొత్తం	110	100

4న ఇసుక సమస్యపై ధర్నా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 1: ఇసుక సమస్యలపై జిల్లావ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇసుక సమస్యలన్నింటినీ తొలగిస్తామని ప్రజలకు హామీ ఇచ్చి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే ప్రస్తు ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ ప్రజలపై భారం తగ్గించేవిధంగా లేదని విమర్శించారు. ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు, ఆచరణలో జరుగుతున్నదానికి చాలా వ్యత్యాసముందన్నారు. ఇప్పటికీ ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమంగా తరలిపోతోందన్నారు. గత వంద రోజుల్లో మూడుసార్లు ఇసుక పాలసీ గురించి స్వయంగా ముఖ్యమంత్రి సమీక్ష చేసినా, పరిస్థితి మెరుగు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక సమస్యలతో భవన నిర్మాణ పనులు తగ్గిపోయి ఆ రంగంపై ఆధారపడిన కార్మికులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ పోస్టులకు 303 దరఖాస్తులు

అనంతపురం విద్య, అక్టోబరు 1: అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు 303 దరఖాస్తులు వచ్చినట్టు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్ 9 పోస్టులకు 68 దరఖాస్తులు, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు నాలుగింటికి 11 దరఖాస్తులు, అంగన్‌వాడీ హెల్పర్ 71 పోస్టులకు 224 దరఖాస్తులు వచ్చాయన్నారు. డివిజన్ల వారీగా చూస్తే.. అనంతపురం డివిజన్ అన్ని పోస్టులకు 102, గుంతకల్లులో 66, కళ్యాణదుర్గం డివిజన్‌లో 56 దరఖాస్తులు వచ్చాయన్నారు.

హిందువుల పట్ల కుట్రలను తిప్పికొడదాం

- వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు
- అనంతలో హిందువుల భారీ ర్యాలీ

అనంతపురం కల్చరల్/ సెంట్రల్, అక్టోబరు 1: హిందువుల మనోభావాలను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టడానికి ప్రతి హిందువు మేల్కోవాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి లడ్డూ వ్యవహారంలో జరుగుతున్న తతంగంపై మంగళవారం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ జిల్లా శాఖల సంయుక్తాధ్వర్యంలో హిందువుల భారీ ఐక్యత ర్యాలీని నిర్వహించారు. దత్తాత్రేయ మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే మధుసూదన గుప్తా, ఆర్ఎస్ఎస్ విభాగ సంఘచాలక్ హిమకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో పూజలందుకునే ఆలయాలు, రథాలు, విగ్రహాలపై గత ప్రభుత్వంలో దాడులు, ధ్వంసాలు అధికంగా జరిగాయన్నారు. ఆలయాలను ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నడిచేలా చేస్తే భద్రత ఉంటుందని తెలిపారు. రాజకీయ, ప్రభుత్వ జోక్యం లేకుండా హిందూ ఆలయాలకు సనాత బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై రిటైర్డ్ జడ్జితో సమగ్ర విచారణ చేయించాలన్నారు. ఇందులో దోషులుగా తేలిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు ప్రబోధానంద, రవికుమార్, రామూర్తి, జగదీష్ కుమార్, బీజేపీ నాయకులు రత్నమయ్య, వెంకటేశ్వరరెడ్డి, చిరంజీవి రెడ్డి, అశోక్‌రెడ్డి, లలిత్‌కుమార్, అంకాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పెళ్లి చేసుకుని.. పారిపోయిన యువతి

పురం వరుడికి భీమవరం బ్రోకర్ల బురిడీ

హిందూపురం, అక్టోబరు 1: ఏళ్లు గడుస్తున్నా పెళ్లి కావడం లేదు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నారు. తన పెళ్లి చూడాలన్న వారి కోరిక తీర్చాలని కొడుకు తపించాడు. డబ్బులు ఖర్చు చేసైనా పెళ్లి చేసుకోవాలని దూర ప్రాంత అమ్మాయిని బ్రోకర్ల సాయంతో వివాహం చేసుకున్నాడు. వారం రోజుల తరువాత ఆమె మస్కా కొట్టి వెళ్లిపోయింది. బ్రోకర్లు ఫోన్ ఎత్తడం మానేశారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం రాచపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇలా మోసపోయాడు. ఆ వ్యక్తి నాలుగు నెలల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. పెళ్లైన వారానికే ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కొద్ది రోజులు ఆగి కాపురానికి వస్తానన్న ఆమె.. తిరిగి రాకపోవడంతో బాధితుడు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు వ్యవసాయం చేస్తున్నాడు. రైతు కావడంతో నలభై ఏళ్లు గడిచినా పెళ్లి కాలేదు. దీంతో సోమందేపల్లి మండలానికి చెందిన స్నేహితుడితో కలిసి భీమవరంలో అమ్మాయిలను చూసేందుకు ఏప్రిల్‌లో వెళ్లారు. అక్కడ కొందరు పెళ్లిళ్ల బ్రోకర్లు అమ్మాయిలను చూపించారు. నీలపు బాల అనే అమ్మాయితో పెళ్లి కుదిర్చారు. బాధితుడి తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో వీడియో కాల్ ద్వారా చూపించి, అక్కడే ఆమెను పెళ్లి చేసుకున్నాడు. బ్రోకర్లకు రూ.4 లక్షలు ఇచ్చాడు. భార్యతో కలిసి స్వస్థలానికి చేరుకున్నాడు. వారం రోజుల తరువాత తన తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగాలేదని నీలపు బాల భర్తకు చెప్పింది. 'పెళ్లి సమయంలో తల్లిదండ్రులు లేరని చెప్పావు కదా?' అని ఆమెను నిలదీయడంతో 'ఎవరు చెప్పారు నాకు తల్లిదండ్రులు లేరని?' అని ఆమె భర్తను ప్రశ్నించింది. పుట్టింటికి పంపకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దీంతో చేసేది లేక ఆమెను భీమవరానికి తీసుకువెళ్లాడు. అక్కడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే 'నువ్వు మా ఇంటికి రావద్దు. ఇంట్లో తెలియకుండా నిన్ను పెళ్లి చేసుకున్నా. ఇప్పుడు నువ్వు మా ఇంటికి వస్తే మా కుటుంబ సభ్యులు గొడవపడతారు. నేనొక్కదాన్నే వెళతా..' అని భర్తకు చెప్పింది. తన తల్లిదండ్రుల ఆరోగ్యం మెరుగుపడగానే తిరిగి వస్తానని నమ్మించి, భర్తను వెనక్కు పంపించింది. కొన్ని రోజుల తరువాత ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసింది. మోసపోయానని తెలుసుకున్న బాధితుడు.. మధ్యవర్తులను సంప్రదించాడు. మొదట్లో ఒకరిద్దరు స్పందించారు. ఆ తరువాత ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తాడేపల్లి గూడెం వెళ్లాడు. అక్కడి పోలీసులు స్పందించలేదు. దీంతో మంగళవారం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేస్తామని సీఐ ఆంజనేయులు తెలిపారు.



నీలపు బాల

ఎండ మోత.. ఉక్కపోత

బుక్కరాయసముద్రం, అక్టోబరు1: నైరుతి పవన కాలం ముగియడంతో ఉమ్మడి జిల్లాలో గత రెండు రోజుల నుంచి ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోతున్నారు. సాధారణంగా నైరుతి పవనాలు నాలుగు నెలలు పాటు ఉమ్మడి జిల్లాలో ఉంటాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. జిల్లాకు జూన్2న నైరుతి పవనాలు రాకతో పలు చోట్ల వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ పవనాలు తిరోగమనంతో వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వేడి పెరిగింది. సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు 32.5-33 డిగ్రీలు ఉండాలి. ప్రస్తుతం సాధారణం కంటే అధికంగా 35 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్త తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలలో మార్పు ఉందని తెలిపారు. అక్టోబరు రెండో వారంలో ఈశాన్య రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆ రుతు పవనాల ప్రభావం అనంత సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే ఉండే అవకాశం ఉందన్నారు. ఈ పవనాల ప్రభావంతో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

రానున్న ఐదు రోజుల్లో వర్షసూచన

రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం పలుచోట్ల కురిసే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. పలుచోట్ల గాలులు గంటకు 3-7కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందన్నారు.

ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకోండి: వైసీపీ

అనంతపురం క్రైం, అక్టోబరు 1: ఉమ్మడి జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు చేతి కందే పరిస్థితి లేదని, రైతాంగాన్ని ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గత ఏడాది, ఈ ఏడాది కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ ఖరీఫ్‌లో వేరుశనగ మాత్రమే 4.50లక్షల ఎకరాల్లో సాగైందని, కంది, కొర్ర, మొక్కజొన్న, జొన్న ఇతర పంటలు సుమారు 8 లక్షల ఎకరాల్లో సాగులో ఉన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందన్నారు. క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంటే ప్రభుత్వం ఆదుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు.

రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20వేలు ఇవ్వలేదని విమర్శించారు. రబీ నేపథ్యంలో వేరుశనగ విత్తనం 50శాతం సబ్సిడీతో అందించాలన్నారు. పంటలబీమా ప్రీమియం చెల్లింపుపై స్పష్టత లేదని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 12వేల విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 4వేల ట్రాన్స్‌ఫార్మర్స్ అవసరం ఉన్నట్లు వెల్లడించారు. శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి నీటి వాటాను అధికంగా సాధించి వాడుకునేలా ప్రయత్నించాలని సూచించారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

బీమా.. పాడి రైతుకు ధీమా

- గొర్రెలు, మేకలకు సైతం వర్తింపు
- గత ప్రభుత్వంలో కుదేలైన పథకం
- పునరుజ్జీవింపజేసిన కూటమి సర్కారు

ఉరవకొండ, అక్టోబరు1: పాడి రైతులకు కూటమి ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. వైసీపీ పాలనలో కుదేలైన పశుబీమా పథకాన్ని పునరుజ్జీవింపజేసింది. దీంతో పాడి రైతులు, పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో జీవనాధారమైన పాడి పశువులు చనిపోయినా నష్ట పరిహారమందక అనేకమంది ఇబ్బంది పడ్డారు. గత రెండేళ్ల నుంచి ఉరవకొండ పశుసంవర్ధక శాఖ పరిధిలో 1600దాకా ఆవులు, మేకలు, గొర్రెలు, గేదెలు చనిపోయాయి. వాటికి సంబంధించి రూ.15కోట్ల దాకా పరిహారం పెండింగ్‌లో ఉంది.

ఎస్సీ, ఎస్టీలకు 80శాతం మినహాయింపు

పశుబీమా పథకానికి చెల్లించాల్సిన ప్రీమియం మొత్తంలో ఎస్సీ, ఎస్టీలకు 80శాతం ప్రభుత్వమే భరించనుంది. రూ.30వేలు విలువ చేసే పశువుకు రూ.1920లు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో 80శాతం (రూ.1536) ప్రభుత్వమే చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పాడి రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కసారి ప్రీమియం చెల్లిస్తే పథకం మూడేళ్లపాటు వర్తిస్తుంది. దేశీయ పశువులకు రూ.15వేలకు రూ.768లు ప్రభుత్వ రాయితీ పోనూ, లబ్ధిదారులు రూ.192లు చెల్లించాలి. ఇతరులు 50 శాతం కట్టాలి. మేలు జాతి పశువుకు రూ30వేలకు గానూ ప్రభుత్వం రాయితీ రూ.960లు, లబ్ధిదారులు రూ.960లు బీమా కట్టాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకలకు ప్రతి ఏడాది ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ ఎస్టీలకు 80శాతం ప్రభుత్వం రాయితీ, ఇతర లబ్ధిదారులకు 50శాతం రాయితీ ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ గొర్రెలకు, మేకలకు రూ.6వేలు బీమా అందిస్తోంది. ప్రభుత్వం రాయితీ రూ.144లు, లబ్ధిదారులు రూ.36 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇతరులు సంవత్సరానికి రూ.6వేలు బీమాకు ప్రభుత్వం రాయితీ రూ.90లు, పెంపకం దారులు రూ.90లు ప్రీమీయం చెల్లించాల్సి ఉంది. ఒక్కొక్క పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు 5పశువుల వరకూ బీమా పొందే అవకాశముంటుంది. ఒక్కో పశువుకు గరిష్ఠంగా రూ.1.10 లక్షలు వరకూ బీమా చేసుకోవచ్చు.



నిబంధనలివే..

రైతులు బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, ఎస్సీ, ఎస్టీలు తెల్లరేషన్ కార్డును జతచేయాలి. పశువులు మరణించిన వెంటనే దగ్గర్లోని పశు వైద్య అధికారికి లేదా 1962కి ఫోన్‌చేసి తెలిపాలి. బీమా చేయించిన పశువును అమ్మిన ఏడు రోజులలోపు బీమా కంపెనీ వారికి తెలియబరిచి బీమా పాలసీని కొనుగోలు దారు పేరుపై నమోదు చేయించుకోవాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే గ్రామాలలో పశుబీమా పథకం, టీఎంఆర్ పథకాలపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రాయితీపై టీఎంఆర్(టోటల్ మిక్స్‌డ్ రేషన్‌ను) రైతులకు ఇస్తున్నాం. టీఎంఆర్ రూ.371 మెట్రిక్ టన్నులు కావాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

\- వెంకటేశ్వర్లు, పశుసంవర్ధకశాఖ డీడీ

పోలీసు పహారా నడుమ ఇంటర్వ్యూలు

- ఆరోపణలు ఉన్న వారిని పిలవడంపై విమర్శలు
- ఎస్ఎస్‌ఏ ఇంటర్వ్యూలకు 13 మంది హాజరు

అనంతపురం విద్య, అక్టోబరు 1: సమగ్రశిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఎంపిక ఇంటర్వ్యూలు పోలీసుల పహారా నడుమ మంగళవారం నిర్వహించారు. ప్రాజెక్టులోని డీపీసీ చాంబర్‌లో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఈఓ వరలక్ష్మి , ఏపీసీ నాగరాజు, డైట్ ప్రిన్సిపాల్ రవిసాగర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు అని చెప్పినా ఆలస్యంగా ప్రారంభించారు. వివిధ రకాల ఆరోపణలు ఉన్న వారిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా గతంలో కేజీబీవీల్లో క్రైస్తవ మత ప్రార్థనలు చేయించి, ఆరోపణలు ఎదుర్కొన్న వారు, వైసీపీ హయాంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు, సాధారణ ఎన్నికల్లో నాయకుల ముందు, వెనుక నడిచిన వారిని సైతం జిల్లా ఎంపిక కమిటీ మళ్లీ ఇంటర్వ్యూలకు ఆహ్వానించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొందరు సంఘాల నేతలు అక్కడే నిరసన తెలపాలని చూశారు. ఇది ముందుగా పసిగట్టిన అధికారులు పోలీసులను రప్పించి, ఖాకీ నీడన ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 14 మంది అభ్యర్థులకుగా 13 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వనున్నారు.



డీపీసీ చాంబర్ వద్ద కాపలా ఉన్న పోలీసులు

బాలసదన్ పోస్టులకు 85 దరఖాస్తులు

బాల సదన్‌లో ఏడు పోస్టులకు 85 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. స్టోర్ కీపర్ పోస్టుకు 47 దరఖాస్తులు, హౌస్ కీపర్‌కు 10, ఎడ్యుకేటర్‌కు 10, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్‌కు 10, యోగా టీచర్ పోస్టుకు 8 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

కేజీబీవీలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



కొత్తచెరువు, అక్టోబరు 1: శ్రీ సత్యసాయి జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న 70 పోస్టులను భర్తీ చేయనున్నట్లు డీఈఓ మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమిస్తామన్నారు. ఖాళీల వివరాలు ప్రిన్సిపాల్ 1, సీఆర్టీ 18, టీజీటీలు 30, అకౌంటెంట్ 4, వార్డెన్‌లు 5, పార్ట్‌టైం టీచర్లు 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు హెచ్‌టీటీపీ..//ఏపీకేజీడీవై.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో పదో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. ఓపెన్ కేటగిరి వారికి వయోపరిమితి 18 నుంచి 42 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఈడబ్ల్యూఎస్ 5, మాజీసైనిక ఉద్యోగులకు మూడు, దివ్యాంగులకు పదేళ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందన్నారు. సబ్జెక్టుల వారిగా, రోస్టర్ వారిగా పోస్టుల వివరాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. శ్రీసత్యసాయిజిల్లా నుంచి దరఖాస్తు చేసుకునే వారు ఏవైనా సమస్యలుంటే సమగ్ర శిక్ష అభియాన్‌లోని ఏజీసీడీఓ టోల్ ఫ్రీ నెంబరు 9100599960 నెంబరు సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా ...

విద్యాసంస్థల దోపిడీని అడ్డుకోండి

ధర్మవరం, అక్టోబరు 1: పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అడ్డుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విద్యాహక్కుచట్టం జీఓ 1ని పాటించకుండా.. అధికంగా ఫీజులు వసూలు చేస్తూ.. విద్యతో వ్యాపారం చేసే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ-1,2 రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు నాగార్జున, ప్రసాద్, విజయ్‌కుమార్, పురుషోత్తం, అమర్నాథ్‌రెడ్డి, హరి, మంజుల నరేంద్ర, బాలాజీ, పోతలయ్య, నిరంజన్, పవన్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పునాదుల కూల్చివేత దారుణం

ధర్మవరం, అక్టోబరు 1: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో 650-2లో ప్లంబర్స్‌కు చెందిన పునాదులను బీజేపీ నాయకులు కూల్చివేయడం దారుణమని సీపీఎం జిల్లా నాయకుడు జంగాలపల్లి పెద్దన్న అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు గొడుగు నాగరాజు, సోము, బాలకృష్ణయాదవ్ దౌర్జన్యంగా పునాదులను కూల్చివేయడం తగదన్నారు. మంత్రి సత్యకుమార్ జోక్యం చేసుకొని.. ప్లంబర్స్‌కు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మారుతి, ఎస్‌హెచ్‌బాషా, జేవీరమణ, అయూబ్‌ఖాన్, హరి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బకాయి కూలి ఇవ్వండి

కదిరి అర్బన్, అక్టోబరు 1 : గత నెల విజయవాడలో భారీ వర్షాల నేపథ్యంలో అక్కడ సేవలు అందించడానికి కదిరి నుంచి వెళ్లిన పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న రెండు జతల దుస్తులు, కూలి డబ్బులు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ డీఈ షాజహాన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. దుస్తులు, కూలి ఇవ్వాలని సర్క్యూల్ వచ్చినా ఇంతవరకు కార్మికులకు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, రఫీ, మున్సిపల్ యూనియన్ నాయకులు బాలక్రిష్ణ, తిరుపాల్, జనార్ధన్, చిన్నక్రిష్ణ, రాజు, రామాంజు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో మంత్ర పఠనం

కదిరి అర్బన్, అక్టోబరు 1: తిరుమల వెంకటేస్వారస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీని నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రయాశ్చింత దీక్షకు మద్దతుగా నమో నారాయణ మంత్రపఠనం నిర్వహించారు. మంగళవారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భైరవప్రసాద్, చలపతి, రవికుమార్, రమణ, గవ్వల శ్రీనివాసులు, ప్రసాద్, రాజారామ్, సోముశేఖర్, గంగరాజు పాల్గొన్నారు.

రేపు గ్రామసభలు

నంబులపూలకుంట, అక్టోబరు 1: ఉపాధి పథకం పనులు గుర్తించడానికి మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మనోహర్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో పంచాయతీలకు అవసరమైన పనులను గుర్తిస్తామని, ప్రజలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల రద్దు

కదిరి అర్బన్, అక్టోబరు 1: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కదిరి పట్టణ, మండల కమిటీలు రద్దు చేసినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు రామక్రిష్ణ తెలిపారు. రాయలసీమ జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కదిరికి వచ్చారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ కమిటీలు రద్దు చేశామన్నారు. యువత, విద్యావంతులతో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలు ఎంపిక చేస్తామన్నారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కమిటీలను కూడా రద్దు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పలక అంజనేయులు, మణివర్ధన్, గంగాధర్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఆర్థిక సాయం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 1: మండలంలోని కొండకమర్ల దిగువ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త పి. రవీంద్రా తల్లి నరసమ్మ ఇటీవల మరణించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మంగళవారం వారి నివాసానికెళ్లి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. అలాగే కుసుమవారిపల్లికి చెందిన చారుపల్లి భాగ్యశ్రీకి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,00,783, వీర ఓబునపల్లికి చెందిన భారతి రూ.82,935 చెక్కులు అందించారు. అనంతరం మహమ్మదాబాద్ క్రాస్‌లో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, రాజారెడ్డి, జాకీర్ అహమ్మద్, బడిశం రామాంజనేయులు, గంగాద్రి, కొండే ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐగా ఉమామనోహర్‌రాజు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 1 : ఎక్సైజ్ ఎస్ఐగా ఉమామనోహర్‌రాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి రమణారెడ్డి కర్నూలు జిల్లా చెక్‌పోస్ట్‌కు బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా ఎస్పీపై రెడ్డి బాటిల్ యూనిట్‌లో ఉన్న ఉమామనోహర్‌రాజును ఇక్కడికి బదిలీ చేశారు.

ఆర్డీఓకు సన్మానం

ధర్మవరం, అక్టోబరు 1: బదిలీపై వెళ్తున్న ధర్మవరం ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డిని మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి.. వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఏఓ ఖతిజన్ కుబ్రా, డివిజన్‌లోని తహసీల్దార్‌లు నటరాజ్, మునుస్వామి, భాస్కర్‌రెడ్డి, స్వర్ణలత, రమాదేవి, సురేశ్‌బాబు, జమీవుల్లాఖాన్, ఎంఈఓ-2 గోపాల్‌నాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.

మొబైల్ ఆస్పత్రి సేవల పరిశీలన

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 1: మండలంలోని వెంగళమ్మచెరువులో సత్యసాయి మొబైల్ ఆస్పత్రి సిబ్బంది గ్రామీణులకు అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం పరిశీలించారు. సత్యసాయి బాబా గ్రామీణ ప్రజల ముంగిటకే అందిస్తున్న వైద్యసేవలు అమోఘమని కొనియాడారు.

వరద బాధితులకు చిన్నారుల విరాళం



ధర్మవరం, అక్టోబరు 1 : విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా స్థానిక నాగార్జున ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు రూ.10 వేలను విరాళాలను సేకరించారు. పట్టణంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో సోమవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు అందజేశారు.

రూ.50 వేలు వితరణ



పుట్టపర్తి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 50 వేల చెక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుకు టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం అందజేశారు. మంగళవారం అమరావతిలోని కేంద్ర కార్యాలయంలో ఆ చెక్‌ను సీఎంకు అందజేశారు. ఆయన వెంట కురుమాల శేషు, గుల్బర్గా షామీర్, బీడుపల్లి ఇబ్రహీం, మనోహర్‌మాల ఉన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



కదిరి, అక్టోబరు 1 : అనంతపురంలో ఇటీవల జరిగిన జిల్లా ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ పోటీల్లో కదిరి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు స్వప్న, సాయి ప్రియ, అర్చన, షమీరా సత్తాచాటారు. దీంతో వీరు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల పీడీ శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు.

పొదల కాలువ

- కుంచించుకుపోతున్న హంద్రీనీవా కాలువ
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- తగ్గుతున్న నీటి ప్రవాహ సామర్థ్యం



కాలువలో పెరిగిన ముళ్ల పొదలు

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 1 : జిల్లాలో హంద్రీనీవా కాలువ రోజురోజుకు కుచ్చించుకపోతోంది. రాయలసీమ ప్రజల వరప్రదాయిని అయిన ఈ కాలువ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నేడు హీనస్థితికి చేరింది. జిల్లాలో 232 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ విస్తరించి ఉంది. గతంలో 2,500 నుంచి 1600 క్యూసెక్కుల నీరు ప్రవహించే సామర్థ్యం ఈ కాలువకు ఉండేది. ప్రస్తుతం దాని సామర్థ్యం 600 క్యూసెక్కులకు దిగజారింది. ఈ కాలువ పలుచోట్ల కుంగిపోయింది. పూడిక పేరుకుపోయింది. కాలువ ఇరువైపుల.. కాలువలో దట్టమైన కంపచెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. దీంతో నీటి తరలింపు సామర్థ్యం చాలా వరకు తగ్గింది. జిల్లాలో ఈ కాలువ ద్వారా గొల్లపల్లి, మరాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. అంతేకాకుండా ఈ కాలువ ద్వారా 192 చెరువులకు నీటిని నింపాల్సి ఉంది. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్‌కు మాత్రమే నాలుగు వందల క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈ కాలువ సామర్థ్యం చాలా వరకు తగ్గిపోవడంతో ఈ సీజన్‌లో పూర్తిస్థాయిలో చెరువులు, రిజర్వాయర్లకు నీటి సరఫరా అనుమానమే. ఇప్పటికైనా పాలకులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని హంద్రీనీవా కాలువకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

హంద్రీనీవా కాలువ పలుచోట్ల కుంగిపోయింది. పూడికతో నిండింది. ముళ్లపొదలూ భారీగా పెరిగాయి. దీంతో నీటి సామర్థ్యం తగ్గిపోయిన మాట వాస్తవమే. కాలువ మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాగానే ఆ పనులు చేపట్టి.. పూర్తిస్థాయిలో నీటి తరలింపునకు చర్యలు తీసుకుంటాం.

దేశీనాయక్, సూపరింటెండెంట్

మారాల రిజర్వాయర్‌కు నీరివ్వండి



పుట్టపర్తి నియోజకవర్గంలో ఏకైక రిజర్వాయర్ అయిన మారాలకు హంద్రీనీవా కాలువ ద్వారా త్వరగా నీరు నింపడానికి చర్యలు తీసుకోవాలి. రిజర్వాయర్‌లో నీరుంటే తాగు, సాగునీటికి ఇబ్బందులుండవు. అలాగే పశువుల దాహార్తికి నీటి కొరత ఉండదు. అధికారులు చర్యలు తీసుకుని మరాల రిజర్వాయర్‌ను నింపాలి.

- లక్ష్మీనారాయణ, రైతు, క్రిష్ణాపురం

అధికారులు స్పందించాలి



హంద్రీనీవా కాలువకు మరమ్మతులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మరాల రిజర్వాయర్‌లో నీరుంటే తాగునీటి కొరత తీరుతుంది. మరాలతో పాటు చుట్టుపక్కలున్న 70 గ్రామాలకు తాగునీటి కొరత ఉండదు. అలాగే భూగర్భజలాలూ పెరుగుతాయి. కూటమి ప్రభుత్వం స్పందిచాలి.

- నాగరాజు, రైతు, క్రిష్ణాపురం

పింఛన్ల పంపిణీ

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: తలుపుల మండలంలోని కుర్లిరెడ్డివారిపల్లిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రామనాయక్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు: తలుపుల మండలంలోని బత్రేపల్లిలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్థులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సొంత ఖర్చుతో బోరు వేయించి ఆ సమస్య పరిష్కరించారు. దీంతో ఆ గ్రామస్థు లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పుట్టపర్తి నియోజకవర్గంలో..

బుక్కపట్నం సుందరయ్య కాలనీలో ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, గంగాధర్, వెంకటనారాయణరెడ్డి, సామకోటి ఆది, చెన్నక్రిష్ణ, నాయకులు పాల్గొన్నారు. అలాగే కొత్తచెరువు, నల్లమాడ మండలాల్లోనూ వీరు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, చందనబాబు, పద్మనాభరెడ్డి, నాగరాజు, నాగభూషణరెడ్డి, నిజాంవలీ, దస్తగిరివలీ, రహీమాన్, ఎవీ కేశవరెడ్డి, అబ్దుల్‌సాబ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కదిరిలో పింఛన్ల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట



బుక్కపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర

కంది పంటలో పచ్చపురుగు నివారణ చర్యలు చేపట్టండి

ధర్మవరం రూరల్, అక్టోబరు 1 : ఖరీఫ్‌లో సాగుచేసిన కంది పంట పూత, పిందె దశలో ఉందని, దీనికి ఆశించిన పచ్చపురుగు నివారణకు మందులు పిచికారి చేసుకోని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కేవీకే శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చిగిచెర్ల, ఉప్పునేసిన పల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కిషోర్‌రెడ్డి కంది పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. కందిలో పచ్చపురుగు నివారణ కొరకు ఇమామెక్టిన్, బెంజోయేట్ 100 గ్రాములను నీటిలో కలుపుకుని ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. అదేవిధంగా 19-19-19 కాంప్లెక్స్ ఎరువును ఎకరాకు ఒక కేజీ , బోరాన్ అర కేజీ ఎకరాకు పూత, మొగ్గ విడిచిన తర్వాత పిచికారి చేసుకోవాలన్నారు.

గాండ్లపెంట : మండలంలోని ఎర్రచేనుపల్లి, కటకంవారిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ.. వరి పట్ట దశలో ఉందని, ప్రొటీనోపాస్ రెండు మిల్లీలీటర్లు లేదా ఓమేట్ రెండు మిల్లీలీటర్లను లీటర్ నీటిలో పిచికారి చేయాలన్నారు.

నల్లమాడ : మండలంలోని పుల్లగూర్లపల్లి, తోలేటివారిపల్లి పొలాల్లో మంగళవారం ఏఓ సుమతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఇందులో పట్టుపరిశ్రామ శాఖ సంయుక్త సహాయ సంచాలకులు పద్మమ్మ, పశువైద్యాధికారి రవినాయక్ పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలంలోని గోపాలపురం, టీఎస్.కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఇందులో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ, పశువసంవర్ధక, పట్టుపరిశ్రమ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలోని గొల్లపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శ్రీహరినాయక్, జనజాగృతి నేచ్యురల్ ఫామింగ్ ఎక్స్‌పడ్ సుప్రియ, గరుడప్ప, రైతులు ఇందులో పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రతిభ



జిల్లా స్థాయికి ఎంపికైన ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం, అక్టోబరు 1 : స్థానిక ఎన్జీఓ హోంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు మంగళవారం నిర్వహించారు. స్థానిక కాకతీయ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు లిఖిత, అంజుమ్, జస్వంత్‌రెడ్డి 40 మార్కులకు 34 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచి.. జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : స్థానిక బాలుర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించి.. ప్రతిభ గల విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. వారిలో ఎస్. నవాజ్, పృథ్వీ, కిరణ్‌కుమార్, ధనుశ్రీ, క్రిష్ణరుషిత, ముస్కాన్ ఉన్నారని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నరసారెడ్డి తెలిపారు.



జిల్లా స్థాయికి ఎంపికైన కదిరి విద్యార్థులు

ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పరీక్షను నిర్వహించారు. జిల్లా చెకుముకి పరీక్షకు మండలం నుంచి గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గౌతమ్ కుమార్, షరీఫ్, మనోహర్, రెయింబో పాఠశాల విద్యార్థులు లయశ్రీ, యశ్వంత్‌నాయుడు, హర్షవర్ధన్ ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎన్. మహేంద్రరెడ్డి తెలిపారు.



జిల్లా పరీక్షకు ఎంపికైన ఓడీసీ విద్యార్థులు

బుక్కపట్నం : స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో జనవిజ్ఞాన వేదిక మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్సు పరీక్షలో సిద్ధరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిన్నశివయ్య, చందుప్రియ, లోకేష్‌కుమార్ జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు.



ఎంపికైన సిద్ధరాంపురం విద్యార్థులు



వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వృద్ధులకు వైద్యపరీక్షలు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 1 : ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక సత్యసాయి వృద్ధాశ్రమంలో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం డైరక్టర్ డాక్టర్ నివేదిత మాట్లాడుతూ.. వృద్ధులకు మానసిక ప్రశాంతత చాలా అవసరమన్నారు. వృద్ధులకు ఎటువంటి ఆనారోగ్య సమస్యలు తలెత్తినా అందుబాటులో ఉండి వైద్యపరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిడామాలజిస్టు బాలాజీనాయక్, ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జోత్స్న, సామాజిక వైద్య అధికారి నగేష్, పీహెచ్ఎన్ లలితకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ్‌భాస్కర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా ఓటరు సవరణ : కలెక్టర్

పుట్టపర్తి, అక్టోబరు 1: జిల్లా వ్యాప్తంగా నిర్ణయించిన గడువులోగా ఓటర్ల సవరణ జాబితాను సిద్ధం చేస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ వివరించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఇంటింటి సర్వే 99.32శాతం పూర్తి అయిందని, జాబితాలో సవరణ కోసం 14,08,524 దరఖాస్తులు రాగా, వాటిలో 13,98,947 దరఖాస్తుల పరిశీలన పూర్తి అయిందన్నారు. మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఈడీటీ మైనుద్దీన్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

పుట్టపర్తి, అక్టోబరు 1 : స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన పార్టీ సభ్యత్వ నమోదు , సమీక్ష కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తల సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీ గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో చిక్‌బళాపూర్ ఎంపీ సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, దేవానంద్, పార్థసారథి, తలుపుల గంగాద్రి రమేష్‌రెడ్డి, హరికృష్ణ, కొండమరాజు, కత్తిరాజారెడ్డి, జ్యోతప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రులు

ధర్మవరం రూరల్: స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను ఈనెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ వెంకటేశులు, అర్చకులు కోనేరాచార్యులు తెలిపారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

కానిస్టేబుల్ మంజమ్మకు ఎస్పీ అభినందన



మంజమ్మను అభినందిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 1 : చండీఘడ్ రాష్ట్రం భిలాయ్ పట్టణంలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగా మహిళా పోటీల్లో హిందూపురం గ్రామీణ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మంజమ్మ కాంస్య పతకం సాధించింది. దీంతో మంజమ్మను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ వీ రత్న అభినందించారు. పోలీసు రివార్డుకు ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అనారోగ్యంతో ఆత్మహత్య



శివయ్య (ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 1: స్థానిక డోబీకాలనీలో నివాసముంటున్న కొత్తకోట శివయ్య (58) అనారోగ్యంతో మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తకోట శివయ్య కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా... ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మీదేవి, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శివయ్య మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివయ్యకు భార్య, కుమారుడు నాగేంద్ర ఉన్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి



నారాయణప్ప (ఫైల్)

ధర్మవరం రూరల్, అక్టోబరు 1 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామానికి చెందిన నారాయణప్ప (70) మంగళవారం మరణించాడు. ఇతను గతనెల 22న మండలంలోని సీతారంపల్లి క్రాస్ వద్ద బైక్‌పై వెళ్తుండగా.. లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్సలు అందించారు. రెండు రోజుల క్రితం కొద్దిగా కోలుకున్నాడని ఇంటికి తీసుకొచ్చారు. అయితే మంగళవారం ఉదయం నారాయణప్ప ఇంటి వద్ద మరణించాడు. ధర్మవరం రూరల్ పోలీసులు గ్రామానికి వెళ్లి అతని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నారాయణప్పకు భార్య రామసుబ్బమ్మ, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



భార్గవ్ (ఫైల్)

తనకల్లు, అక్టోబరు 1 : మండలంలోని నల్లగుట్లపల్లికి చెందిన భార్గవ్ (25) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మరణించాడు. భార్గవ్ బోలేరా వాహనం పెట్టుకుని డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి అన్నమయ్య జిల్లాలోని ములకచెరువుకు టమోటాలు తీసుకెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. చీకటిమానుపల్లి సమీపంలో ఈదులవంక వద్ద ఎదురుగా వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్గవ్ అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. భార్గవ్‌కు వివాహం కాలేదు. చేతికొచ్చిన కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు రాజమ్మ, నారాయణప్ప బోరున విలపించారు.

బీజేపీ నాయకులపై క్రిమినల్ కేసు

ధర్మవరం, అక్టోబరు 1 : స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని ఎలక్ట్రికల్స్ ప్లంబర్స్‌కు చెందిన పునాదులు, కట్టడాలను కూల్చివేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం పునాదులు, కట్టడాలను బీజేపీ నాయకులు కూల్చివేయడంపై ప్లంబర్స్ అసోషియేషన్ నాయకులు సురేంద్ర, రాజు తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో బీజేపీ నాయకులు గొడుగు నాగరాజు, సోము, ఎం.నాగరాజు మరో ఎనిమిది మందిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. వీరిలో కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు

తాడిమర్రి, అక్టోబరు 1: మండలంలోని శివంపల్లి గ్రామానికి చెందిన డేరంగుల నరసింహుడిని అత్యాచారం కింద అరెస్టు చేసినట్లు ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు మంగళవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఓ యువతిపై నరసింహుడు అత్యాచారానికి పాల్పడినట్లు సోమవారం ఫిర్యాదు అందిందని, దీంతో అతన్ని మంగళవారం మధ్యాహ్నం నారసింపల్లిలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

మద్యం విక్రేత అరెస్టు

బత్తలపల్లి, అక్టోబరు 1: స్థానిక శివాలయం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న పోప్పురు గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. అతని నుంచి 50 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని చెప్పారు.

గొట్లూరులో సీపీఎం మహాసభ

ధర్మవరం రూరల్, అక్టోబరు 1: మండలంలోని గొట్లూరు గ్రామంలో సీపీఎంశాఖ మహాసభను మంగళవారం నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ జిల్లా శ్రామిక మహిళ నాయకురాలు దిల్షాద్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, పట్టణ పార్టీ కార్యదర్శి శేషంపల్లి మారుతి, గొట్లూరు శాఖ వెంకటరాముడు, సభ్యులు శ్రీనివాసులు, గురుస్వామి, శ్రీరాములు, వెంకటేశులు పాల్గొన్నారు.

టెండర్లతోనే సరి..!

● వైసీపీ పాలనలో నిర్లక్ష్యం.. మూతపడిన టూరిజం రెస్టారెంట్

● శిథిలావస్థకు చేరుకుంటున్న భవనం



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కొడికొండ చెక్‌పోస్టులోని ఏపీ టూరిజం రెస్టారెంట్

చిలమత్తూరు, అక్టోబరు 1: జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు వద్ద ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉన్న ఏపీ టూరిజం రెస్టారెంట్ పునఃప్రారంభం టెండర్లతో సరిపెట్టుకుపోతోంది. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ రెస్టారెంట్ పాడుబడిపోతోంది. 2005లో అప్పటి ప్రభుత్వం ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం రూ. 60 లక్షల వ్యయంతో ఎంతో సుందరంగా రెస్టారెంట్‌ని నిర్మించింది. 2012 వరకు ప్రభుత్వానికి ఆదాయానికి, ప్రయాణికులకు శుచి శుభ్రతతో కూడిన ఆహారం అందాయి. 2013లో ఆదాయం తగ్గిందని, నిర్వహణకు ఇబ్బందిగా మారిందంటూ ప్రభుత్వం ప్రైవేటు వారికి రెస్టారెంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. ప్రైవేటు నిర్వాహకులు 2017 వరకు రెస్టారెంట్‌ని నిర్వహించారు. అనంతరం లీజు గడువు ముగియడంతో అప్పటి నుంచి రెస్టారెంట్ మూతపడింది. పలు దఫాలుగా రెస్టారెంట్ నిర్వహణకు ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. అప్పట్లో కొందరు టెండర్లు దక్కించుకున్నా నిర్వహణకు ముందుకు రాలేదని సమాచారం. 2021 నవంబర్ 5న మరోసారి టెండర్లకు నోటిఫికేషన్ ఇచ్చి.. అదే నెల 25న బిడ్‌లను ఓపెన్ చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇంతవరకు ఓపెన్ చేసింది లేదు...రెస్టారెంట్ తెరిచింది లేదు. టెండర్లు వేసి వాటిని ఓపెన్ చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేయడంతో రెస్టారెంట్ భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్రస్తుత ప్రభుత్వమైనా పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం రెస్టారెంట్‌ను పునఃప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

కొడికొండ చెక్‌పోస్టుకు గుర్తింపు

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొడికొండ చెక్‌పోస్టులోని టూరిజం రెస్టారెంట్ ఈ ప్రాంతానికి ఒక గుర్తింపుగా ఉంది. ప్రధానంగా 44వ జాతీయ రహదారిలో ఉండటం, కర్ణాటక సరిహద్దులో ఉంటూ రెండు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉండటంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. దాంతో పాటు కొడికొండ చెక్‌పోస్టు పరిధిలో లేపాక్షి, పుట్టపర్తి, కదిరి, వీరాపురం, ఇటు అనంతపురం, అటు బెంగళూరు నగరం ఉండటం వలన నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడేది. అప్పట్లో అధికారులు చేసిన తప్పిదాలు రెస్టారెంట్ మూతపడేందుకు కారణమయ్యాయి.

శిథిలావస్థకు చేరుతున్న భవనం

ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది. గడిచిన ఐదేళ్లుగా మూతపడటం, దానిని పట్టించుకునేవారు లేకపోవడంతో ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. భవనంలో దొంగలు పడి తలుపులు, కిటకీలు ఇలా ఏవి పడితే వాటిని తరలించేశారు. ఆహ్లాదకరమైన పిల్లల ఆటస్థలం, పచ్చని చెట్లు అన్ని నేలకూలాయి. అటుగా రోడ్డున వెళ్లే వారికి అందంగా కనపడిన ఒకప్పటి ఏపీ టూరిజం రెస్టారంట్ భవనం...ఇప్పుడు దెయ్యాల కొంపగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో భవనం శిథిలమవుతోంది.

త్వరలో మంచి రోజులు : నాగేశ్వరరెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి

కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్‌కి త్వరలో మంచి రోజులు వస్తాయి. చాలా కాలంగా రెస్టారెంట్ నిర్వహణకు టెండర్లు పిలిచినా ఎవ్వరూ ముందుకు రాలేదు. దాంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవలే జిల్లా కలెక్టర్ దృష్టికి రెస్టారెంట్ పరిస్థితిని తీసుకెళ్లాం. స్పందించి విజయవాడలోని ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయానికి లేఖ పంపారు. పూర్వవైభవం తీసుకురావడానికి కలెక్టర్ సుముఖంగా ఉన్నారు.

కానిస్టేబుల్ మంజమ్మకు అభినందన



మంజమ్మను అభినందిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 1: చండీఘడ్ రాష్ట్రం బిలాయ్ పట్టణంలో ఇటీవల జరిగిన ఆల్ ఇండియా పోలీసు వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ యోగా మహిళా పోటీల్లో హిందూపురం గ్రామీణ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మంజమ్మ కాంస్య పతకం సాధించింది. దీంతో మంజమ్మను జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ వి. రత్న అభినందించారు. పోలీసు రివార్డుకు ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, ఎస్బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

పరిగి(హిందూపురం) అక్టోబరు 1: పాఠశాలలో నాటిన మొక్కలను ప్రతి విద్యార్థి బాధ్యతగా కాపాడాలని పర్యావరణ వేత్త భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ధనాపురం ఉన్నతపాఠశాల ఆవరణంలో 600 మహాగణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాగణి వృక్షాల వల్ల చల్లటి వాతావరణంతో పాటు వర్షాలు కూడా బాగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, హ్యూమన్ రైట్స్ నాయకుడు భాస్కర్‌నాయుడు, యోగా గురువు రఘు, హెచ్‌ఎం జ్యోతిర్మయి, బీజేపీ నాయకులు చంద్ర, శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

సీడ్‌బాల్స్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులు తయారు చేసిన సీడ్‌బాల్స్‌తో ఉపాధ్యాయ బృందం

పావగడ, అక్టోబరు 1 : ప్రతి ఒక్కరూ సీడ్‌బాల్స్ తయారు చేయడం నేర్చుకుంటే అటవీ సంపదను పెంచడానికి ఆస్కారం ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన సీడ్‌బాల్స్ తయారు సందర్భంగా ఆయన మాట్లాడారు. పిక్నిక్, ఇతర సందర్భాల్లో అటవీ ప్రాంతానికి వెళ్లినప్పుడు వీటిని విసరడంతో అవి మొక్కలై పెరిగి ప్రకృతి సంపదకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. విద్యార్థులచేత తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను అక్షరాలుగా మలిచి వారికి అర్థమయ్యేలా బోధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, కాలనీవాసులు

గోరంట్ల, అక్టోబరు 1: మండలంలోని పాలసముద్రం ఎస్సీకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ మారుతికి మంగళవారం వినతి పత్రం అందించారు. శ్మశానవాటిక సమస్య తీవ్రంగా ఉందని, దారి సరిగాలేక నడుములోతు నీటిలో నడుచుకుంటూ శవాన్ని తరలించాల్సి వస్తోందని వారు వివరించారు. అనువైన చోట మరో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం చూపాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర, మనోహర్, మూర్తి, ఆదినారాయణ, ఆంజనేయులు, ఎస్సీకాలనీవాసులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు వద్దు: ఎస్‌ఎఫ్‌ఐ



ఎంఈఓకు వినతి ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 1: దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎంఈఓ గంగప్పకు మంగళవారం వినతి పత్రం అందించారు. పండగరోజుల్లో కూడా తరగతులు పెట్టుకొని విద్యార్థులను మనోవేదనకు గురిచేస్తే విద్యాశాఖ అధికారులు స్పందించాలన్నారు. అలాంటి విద్యా సంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, పట్టణ నాయకులు తరుణ్, పవన్, హుసేన్ అఫ్రీద్, విశ్వనాథ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

3800 ఎకరాల్లో ఉలవ సాగు

మడకశిర, అక్టోబరు 1 : మడకశిర డివిజన్ పరిధిలో 3,800 ఎకరాల్లో ఉలవ పంట సాగు చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీ కృష్ణమీనన్ తెలిపారు. మంగళవారం ఏడీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా 1300 క్వింటాళ్ల ఉలవ విత్తనాలను సబ్సిడీతో పంపిణీ చేశామన్నారు. మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు ఉలవ పంట సాగు చేశారన్నారు. సాధారణ విస్తీర్ణం 2400 ఎకరాలు ఉంటే.. 3,800 ఎకరాలలో ఉలవ పంట సాగు చేశారని తెలిపారు. గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో ఎక్కువ మంది రైతులు సాగు చేశారన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

గోరంట్ల/సోమందేపల్లి అక్టోబరు 1 : గోరంట్ల, సోమందేపల్లి మండలాల్లో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. గోరంట్ల మండలంలోని 20 పంచాయతీల్లో 11,453 పింఛన్లకుగాను రూ.4,83,89,500 ప్రభుత్వం మంజూరు చేసింది. గోరంట్ల ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. సోమందేపల్లి మండలంలో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి అన్ని గ్రామ పంచాయితీలలో నాయకులు, అధికారులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు 98 శాతం పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సరస్వతీ తెలిపారు. పలు గ్రామాల్లో ఆయా గ్రామాలకు చెందిన స్థానిక కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



కృష్ణవేణిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర రూరల్, అక్టోబరు 1: అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో గౌడనహళ్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర, పీఈటీ అరుణ తెలిపారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు...



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఎంఈఓ

హిందూపురం, అక్టోబరు 1: మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ పరీక్షలో పాల్గొన్న మోడల్ పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. చెర్లోపల్లి వద్ద మోడల్ స్కూల్లో జరిగిన చెకుముకి టాలెంట్ పరీక్షల్లో మోడల్ స్కూల్ విద్యార్థినులు హేమలత, దీక్ష, వినంబ్ర, చిన్మయ పాఠశాల విద్యార్థులు మేఘశ్రీ, చంద్రలేఖ, అచ్యుత ఎంపికైనట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు.

ఎంపీని కలిసిన డీఎస్పీ



ఎంపీ పార్థసారథిని కలిసిన డీఎస్పీ

పెనుకొండ రూరల్, అక్టోబరు 1: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిర రహదారిలోని హిందూపురం పార్లమెంట్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉండేలా చూసుకోవాలని ఎంపీ సూచించారు.

ఎక్సైజ్ ఎస్ఐగా పృథ్వీరాజ్

హిందూపురం, అక్టోబరు 1: హిందూపురం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పృథ్వీరాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురంలో పనిచేస్తున్న పృథ్వీరాజ్‌ని హిందూపురానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణాను అరికడతామని, ప్రజలు సహకరించాలని కోరారు.

కుట్టుమిషన్ పంపిణీ

గోరంట్ల, అక్టోబరు 1: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీకి చెందిన నిరుపేద మహిళ శారదకు ఉపాధ్యాయుడు దేవాంగం జగదీశ్వర్ మంగళవారం కుట్టు మిషన్ పంపిణీ చేశారు. గోరంట్లలోని శ్రీసత్యసాయి టైలరింగ్ సెంటర్‌లో శారద శిక్షణ పొందారు. సొంతంగా కుట్టుమిషన్ ఏర్పాటుచేసుకోలేని స్థితిలో ఉండగా.. సత్యసాయిబాబా భక్తుల సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్ అందించా రు.

వరద బాధితులకు రూ.50వేల సాయం

గుడిబండ, అక్టోబరు 1 : స్థానిక రవీంద్ర ఇంగ్లీష్‌మీడియం స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో వరద బాధితు టలకు రూ.50వేల చెక్కును విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు అందజేయనున్నట్లు యాజమాన్యం ప్రతినిధులు చిత్తయ్య, రాజు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కును చూపుతున్న పాఠశాల ప్రతినిధులు

వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పి కొట్టండి : ఎమ్మెల్యే



కోడిపల్లిలో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, అక్టోబరు 1 : వైసీపీ అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఐటీడీపీ, టీడీపీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అనేక అక్రమాలు, అవినీతి కార్యక్రమాలు జరిగాయని, ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవస్థలను, పాలనను గాడిలో పెట్టే పనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. వంద రోజుల్లోనే ప్రభుత్వంపై పనిగట్టుకొని అసత్యాలను ప్రచారాన్ని ప్రారంభించారని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నాయకులు చంద్రబాబును లక్ష్యంగా చేసుకొని అనేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ఎప్పటికప్పుడు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు రాధాకృష్ణ, మంజునాథ్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మడకశిర రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని కోడిపల్లిలో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి వృద్ధులకు ఫించన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచు రామాంజనేయులు, నాయకులు లక్ష్మీనారాయణ, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని రాళ్లపల్లి, కేకాతి గ్రామాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పింఛన్ల పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, నాయకులు శ్రీనివాసమూర్తి, మద్దనకుంటప్ప, మంజునాథ్, దుర్గేష్, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

దేవున్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు తగవు

● వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉష శ్రీచరణ్

సోమందేపల్లి(హిందూపురం), అక్టోబరు 1: తిరుపతి వెంకటేశ్వరస్వామి లడ్డూని అడ్డుపెట్టుకొని కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేయడం తగదని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుంగోడు గ్రామంలో వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్‌పై అసత్య ప్రచారం చేస్తూ నిందలు వేయడం సరికాదన్నారు. ఆలయ ప్రతిష్ఠను దిగజార్చి కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని, వారిని ఆ దేవుడే చూసుకుంటారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల సందర్భంగా సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇంతవరకు హామీలు నెరవేరలేదన్నారు. స్థానిక మంత్రి సవిత చేనేతలను విస్మరించారని అన్నారు. పార్టీ కండువా వేసుకుంటేనే పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని సర్పంచ్‌లను బెదిరిస్తున్నారని తెలిపారు. నియోజక వర్గ ప్రజలకే న్యాయం చేయని మంత్రి రాష్ట్రానికి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఈ దిశలో తమ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి ఆత్మీయ సమావేశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అశోక్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, గజేంద్ర, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గోరంట్ల : మండలంలోని దిగువగంగంపల్లితండాలో పిడుగుపాటుతో మృతి చెందిన దశరథనాయక్ కుటుంబ సభ్యులను వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి తండాకు వెళ్లి దశరథనాయక్, దేవీబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరనారాయణరెడ్డి, జయరాంనాయక్, రామక్రిష్టారెడ్డి, రఘు, జనార్దన్‌రెడ్డి, శివారెడ్డి, హరి, భైయపరెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి: ఏడీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ స్వయంప్రభ

పెనుకొండ రూరల్/ పరిగి/అమరాపురం/గుడిబండ, అక్టోబరు 1: రైతులు విరివిగా చిరుధాన్యాల పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసా య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ స్వయంప్రభ తెలిపారు. మంగళవారం పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామంలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీ మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో ఎరువులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చందన ఉద్యాన శాఖ అధికారి రాంప్రసాద్, ఏఈఓ అశోక్‌కుమార్, టీడీపీ నాయకుడు శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు. పరిగి మండల పరిధిలోని పైడేటి, ఎర్రగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని విజయభారతి, ఏఈఓ పావని పాల్గొన్నారు. అమరాపురం మండలంలోని బసవనపల్లిలో ఏఓ మంజునాథ్, సెరికల్చర్ అధికారి వేణుగోపాల్‌నాయక్, పశుసంవర్ధకశాఖ అధికారి సౌందర్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు. గుడిబండ మండలంలోని రాళ్లపల్లి, శంకర్‌గల్లు పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీరనరేష్, ఏఈఓలు హేమలత, శారదమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు తుప్పు



పావగడ పోలీస్‌స్టేషన్‌లో తుప్పుపడుతున్న ద్విచక్ర వాహనాలు

పావగడ, అక్టోబరు 1 : పోలీసు యంత్రాంగంలో తీవ్ర నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలకు గురైన, చోరీలో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు తుప్పు పడుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు చేరి నాలుగైదు సంవత్సరాలు గడిచినా వాటిని పరిష్కరించకపోవడంతో వానకు నాని, ఎండకు ఎండి రూ.లక్షల్లో కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనాలు తుప్పుపట్టి మట్టిలో కలిసి పోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన హీరోహోండా, పల్సర్ బైక్ కొనుగోలు చేసిన ఆరు నెలలకే ప్రమాదాలకు గురై పోలీస్‌స్టేషన్‌లకు చేరాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు కారణాల వల్ల పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో ఉన్న వాహనాలను వేలంపాటలోనైనా అవకాశం కల్పిస్తే దక్కించుకొనే ప్రయత్నం చేయవచ్చని వారు అంటున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ



మల్లినమడుగు గ్రామంలో బురదగుంటగా ఉన్న రోడ్డు

మడకశిర, అక్టోబరు 1 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల్లో మట్టి రోడ్లకు మహర్దశ రానుంది. గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో ప్రతి మండలానికి రూ.3 కోట్లు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద గ్రా మాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. 32 మండలాలకు రూ.80 కోట్లు దాకా నిధులు మంజూరయ్యాయి. 32 మండలాలల్లో 110 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. మడకశిర నియోజక వ ర్గంలో 223 పనులకు గాను రూ.15 కోట్ల రూపాయాలు మంజూరయ్యాయి. త్వర్వలోనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌టీ హళ్లి వడ్రట్టి నుంచి రొళ్లకు వెళ్లాలంటే మల్లినమడుగు గ్రామం గుండా వెళ్లాల్సి ఉంటుంది. వర్షం వచ్చినప్పుడు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు తెలిపారు. జిల్లాకు సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 80 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ ఈఈ మురళీమోహన్ తెలిపారు. మడకశిర నియోజకర్గానికి 223 పనులకు గాను రూ.15 కోట్లు మంజూరయ్యాని వివరించారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు.